క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



బయ్యారం: మండలంలోని జగ్గతండాలో పలు పార్టీల్లో నుంచి గురువారం ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గణేష్, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు ఐలయ్య, శ్రీను, లక్ష్మణ్‌నాయక్, వీరన్న, సునీల్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ



మహబూబాబాద్ రూరల్: ఆలిండియా కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోర్.. గద్దీ చోడ్.. అని నినదిస్తూ గురువారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటినుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు

మహబూబాబాద్ రూరల్: త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో రేపటినుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని వేదిక అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికలను టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆవిష్కరించారు.

మౌంటైనర్ యశ్వంత్‌కు ఆర్థికసాయం



మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఉల్లెపల్లి రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలోని భూక్య తండాకు చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్‌కు హైదరాబాద్‌కు చెందిన సంపంగి గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ రమేష్ సంపంగి రూ.లక్ష ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. జూబ్లీహిల్స్ సీఐ వెంకటేశ్వర రెడ్డి సమక్షంలో యశ్వంత్‌కు పరికరాలు, శిక్షణ, ప్రయాణ ఖర్చుల నిమిత్తం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులతోపాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్స్ సంతోష్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

అవార్డు అందజేత

కురవి: మండల కేంద్రానికి చెందిన పీఈటీ, మాజీ క్రీడాకారుడు మేక దామోదర్‌రెడ్డికి సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు.

మైక్‌సెట్‌కు రూ.35వేల అందజేత

కురవి: మండలంలోని నేరడ మోడల్ స్కూల్‌కు మరిపెడ బంగ్లాకు చెందిన ధాన్య లక్ష్మీ రైస్ మిల్ యజమాని దారం నాగేశ్వర్ రావు గురువారం మైక్ సెట్ కోసం రూ.35వేలను అందజేశారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని కేసముద్రం పీఏసీఎస్‌కి చెందిన ఎరువుల అమ్మకం కేంద్రం వద్ద పలువురు రైతులు తమకు యూరియా బస్తాలను అందుబాటులో ఉంచాలంటూ గురువారం ఆందోళనకు దిగారు.

నెల్లికుదురు: మండల కేంద్రంలోని మనగ్రోమోర్ ముందు యూరియా బస్తాలకోసం గురువారం రైతులు చూపులు తప్పలేదు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు యూరియా బస్తాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

పోలీసుల తనిఖీ

డోర్నకల్: స్థానిక ఇందిరానగర్‌లోని కార్యాలయంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇరిగేషన్ అధికారులు అద్దెకు తీసుకున్న కార్యాలయంలో మద్యం సేవిస్తున్నారంటూ పోలీసులకు సమాచారం అందడంతో సీఐ బి.రాజేష్ ఆదేశాల మేరకు ఓ కానిస్టేబుల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇరిగేషన్ డీఈ భద్రునాయక్, ఏఈ కిషన్ కార్యాలయంలో మాట్లాడుతుండగా కానిస్టేబుల్ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయం వెనుక గదిలో రెండు మద్యం బాటిళ్లను గుర్తించిన కానిస్టేబుల్ సీఐకు సమాచారం అందించారు. దీనిపై డీఈ భద్రునాయక్ మాట్లాడుతూ.. మద్యం బాటిళ్ల గురించి తమకు తెలియదని తెలిపారు. దీనిపై పోలీసులకు వివరణ ఇచ్చినట్లు తెలిసింది.

మందు.. మచ్చుకైనా కనపడదు..!

మొట్లతిమ్మాపురంలో సంపూర్ణ మద్య నిషేధం

- ఆదర్శంగా నిలుస్తున్న ఆదివాసీ గ్రామం
- గ్రామంలో జెండాలు వేరైనా.. ఎజెండా ఒక్కటే..
- సమస్యల పరిష్కారమే ధ్యేయం..



మొట్లతిమ్మాపురం గ్రామం

బయ్యారం: 'ఊర్లో తాగుడు బంద్జైనసంది.. గింత లొల్లి సుత్క లేదు.. ఎవరిపని వారే చేసుకుంటుండ్రు... సంసారాలు మంచిగ నడుస్తున్నయ్.. గప్పుడైతే పొద్దు పొద్దున్నే తాగిన వారు బజారుకెక్కి రచ్చ చేసేటోళ్లు.. ఇంటామెను.. పిల్లలను ఊరికించుకుంటు కొట్టెటోళ్లు.. కొన్నేళ్లుగా ఊరిలో మద్యం విక్రయాలు నిలిపివేయడంతో ప్రశాంతంగా ' ఉంది అని గ్రామస్తులు పేర్కొనడం మద్య నిషేధం అమలులో ఆ ఊరి కట్టుబాటు అర్థం చేసుకోవచ్చు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం మొట్లతిమ్మాపురం. పూర్తిగా ఆదివాసీలు నివసించే ఈ గ్రామంలో నేటికీ ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు కొనసాగుతున్నాయి. 15 సంవత్సరాల క్రితం ఆ గ్రామంలో మిగతా గ్రామాల మాదిరిగానే గుడుంబా, మద్యం అమ్మకాలు కొనసాగేవి. దీని వల్ల పెద్దల నుంచి యువకుల వరకు తాగుడుకు అలవాటు పడ్డారు. ఫలితంగా అనారోగ్యం బారిన పడడంతోపాటు పంచాయితీలు పెట్టుకుంటుడడంతో గ్రామస్తులంతా ఏకమై మద్యపాన నిషేధాన్ని అమలు చేసుకుందామని తీర్మానించుకున్నారు. అంతే అప్పటి నుంచి ఆ గ్రామంలో మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి.

పోలీస్‌స్టేషన్ అంటే తెలియదు..

ఊరు ఏర్పడి వందేళ్లు కావొస్తున్నా నేటి వరకు ఆ గ్రామస్తులకు పోలీస్‌స్టేషన్ అంటే తెలియదు. గ్రామస్తుల మధ్య వివాదాలు చోటుచేసుకుంటే పెద్ద మనుషులు చెప్పే తీర్పుకు ఇరువర్గాలు కట్టుబడుతాయి. ఆదివాసీలు పెద్దలుగా భావించే పటేల్, దొరల తీర్పే నేటికీ ఆ పల్లెవాసులకు వేదవాక్కు.

రాజకీయాలతో సంబంధం లేదు..



మా ఊర్లో అన్ని రాజకీయ పార్టీల జెండాలున్నాయి. అయితే ఆ జెండాలు మా మధ్య ఏ నాడు గొడవలు సృష్టించలేదు. పార్టీలతో సంబంధం లేకుండా అందరం ఊరి అభివృద్ధికి పాటుపడుతున్నందునే ఇప్పటి వరకు మా ఊరి వాసులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లలేదు.

– బూర్క పాపయ్య, గ్రామస్తుడు

జెండాలు వేరైనా.. ఎజెండా ఒక్కటే..

ఐకమత్యంగా ఉండే ఆ గ్రామంలో అన్ని పార్టీల సానుభూతి పరులున్నారు. ఎవరికి వారు తమ తమ పార్టీలకు మద్దతుదారులుగా ఉంటున్నా రాజకీయపరమైన విభేదాల జోలికి మాత్రం వెళ్లరు. ఎన్నికల సందర్భంలో తమ గ్రామ సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే పార్టీ అభ్యర్థికి మాత్రమే జెండాలు వేరైనా ఏజెండా మేరకు సమష్టిగా ఓట్లు వేయటం ఆ పల్లెవాసులు ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు.

మానుకోటకు చేరిన రేజంగ్ల రాజ్ కలశ యాత్ర



నెహ్రూసెంటర్: యాత్రకు స్వాగతం పలుకుతున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో చేపట్టిన రేజంగ్ల రాజ్ కలశ యాత్ర గురువారం మానుకోట జిల్లాకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని మహాత్మజ్యోతిబాపూలే విగ్రహం నుంచి బైపాస్ వరకు సాగిన యాత్రకు యాదవ కులస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్, యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వేణుమాదవ్ మాట్లాడుతూ.. బిహార్ రాష్ట్రంలో ప్రారంభమైన యాత్ర జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఏపీ, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, కర్ణాటక మీదుగా తెలంగాణ రాష్ట్రంలో యాత్ర సాగుతుందన్నారు. 1962లో భారత చైనా యుద్ధంలో వీరమరణం పొందిన 114మంది యాదవ శౌర్యయోధులను స్మరించడమే యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో యాత్ర కన్వీనర్ కిరణ్, ఎడ్ల రమేష్, మేకల వీరన్న, శ్రీను, స్వర్ణలత, మహేష్, యాకన్న, శ్రీను, వెంకట్, నారాయణ పాల్గొన్నారు.

డోర్నకల్‌కు చేరిన యాత్ర

డోర్నకల్: జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో రేజంగ్ల రాజ్ కలశ యాత్ర గురువారం డోర్నకల్‌కు చేరుకుంది. కార్యక్రమంలో ఎడ్ల వేణు, శీలం శ్రీనివాస్, కేశబోయిన కోటిలింగం, మల్లేశం, జాల శ్రీనివాస్, పోతుల మల్లేవం పాల్గొన్నారు.

బహుజనులు వేలాదిగా తరలిరావాలి



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న వెంకన్నగౌడ్

నెహ్రూసెంటర్/నర్సింహులపేట/మరిపెడ రూరల్: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణకు గౌడలు, బహుజనులందరూ వేలాదిగా తరలిరావాలని విగ్రహ ఏర్పాటు కమిటీ అధ్యక్షుడు జెర్రిపోతుల వెంకన్నగౌడ్ పిలుపునిచ్చారు. కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనుల కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఈ నెల 16వ తేదీన ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. అన్నివర్గాల ప్రజలు విగ్రహ ఆవిష్కరణకు, సభకు వేలాదిగా తరలిరావాలన్నారు. 2500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముత్యం వెంకన్న, బిక్కి వెంకటేశ్వర్లు, గునిగంటి కమలాకర్, సుదగాని మురళీ, చిత్తనూరి శ్రీనివాస్, నక్క నాగార్జున, ముంజాల రాజేందర్ పాల్గొన్నారు.

ఇళ్లలో చోరీ..

కేసముద్రం: తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరబడి బంగారు, వెండి ఆభరణాలను అపహరించిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లంబుల రాములు తన కుటుంబ సభ్యులతో బుధవారం సాయంత్రం చిన్నముప్పారంలో బోనాల పండుగ జరుగుతుండటంతో బంధువుల ఇంటికి వెళ్లారు. అదే విధంగా వల్లంబుల శాంతమ్మ ఇదే గ్రామంలో ఉంటున్న తన కూతురు ఇంటికి తాళం వేసి బుధవారం సాయంత్రం వెళ్లింది. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చోరబడ్డారు. ఈమేరకు ఇరువురి ఇళ్లల్లో 14గ్రాముల బంగారు ఆభరణాలు, 20తులాల వెండి ఆభరణాలను అపహరించుకుని పరారయ్యారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన బాధితులు తమ ఇళ్లకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈమేరకు సంఘటన స్థలాన్ని ఎస్సై కరుణాకర్ సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత



మొక్క నాటుతున్న రాంచంద్రునాయక్

మరిపెడ: మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని డిప్యూటీ స్పీకర్ జాటోతు రాంచంద్రనాయక్ అన్నారు. మరిపెడలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు పెంచడం వల్ల భవిష్యత్ తరాల వారికి స్వచ్ఛమైన గాలి సమకూరుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి గ్రామంలో మొక్కలు నాటడం పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రుఘువీరారెడ్డి, నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, ఐలమల్లు, అఫ్జల్, రాంలాల్, అంబరీషా, తాజుద్దీన్, అప్సర్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

సార్వత్రిక డిగ్రీ రెగ్యులర్ విద్యతో సమానం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపక బృందం

మహబూబాబాద్ అర్బన్: సార్వత్రికల ఓపెన్ డిగ్రీ రెగ్యులర్ విద్యతో సమానమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రం సమన్వయ కర్త బి.లక్ష్మణ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డిగ్రీ వాల్ పోస్టర్లను గురువారం అధ్యాపకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, బీకాం, బీఏ, బీఎస్సీ, ఇతర కోర్సులు అందుబాటులో ఉన్నయని, పూర్తి వివరాలకు 73829 29705 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పేదలకు లబ్ధి చేకూర్చడమే ధ్యేయం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

డోర్నకల్: ప్రతీ పేదవాడికి లబ్ధి చేకూర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని పాతదుబ్బతండా, కొత్తదుబ్బతండాలో గురువారం నిర్వహించిన ఇందిరమ్మ పల్లెప్రగతి యాత్రలో శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సబ్సిడీ లాంటి పథకాలతో పేదలకు ప్రయోజనం చేకూరిందన్నారు. పేదలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల కల కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జగదీష్‌నాయక్, నాయకులు లాలూనాయక్, పగడాల వెంకటేశ్వర్లు, మేకపోతుల శ్రీనివాస్, భూక్యా శ్రీనివాస్, ఆంగోత్ వెకన్న, ఐలయ్య పాల్గొన్నారు.

పాపన్న ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం



చిన్నగూడూరు: పాపన్న చిత్రపటానికి పూల మాల వేస్తున్న సంఘం బాధ్యులు

చిన్నగూడూరు /దంతాలపల్లి: సర్దాయి సర్వాయి పాపన్న ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ అన్నారు. గురువారం సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో గోపా మండల కమిటీ అధ్యక్షుడు గాడిపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోప డివిజన్ కమిటీ అధ్యక్షుడు కొమిరెల్లి, జిల్లా కార్యదర్శి అనిల్, సంఘం బాధ్యులు జీవన్, మల్లేష్, సారయ్య, వీరన్న, వెంకన్న పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణం అభినందనీయం



కళావేదికను ప్రారంభిస్తున్న ఎంఈఓ రవికుమార్

చిన్నగూడూరు: పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే కళావేదిక నిర్మాణం అభినందనీయమని తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ యాకయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు(1990–91), అదే బ్యాచ్‌కు చెందిన పంజాల వీరన్న(ఎన్నారై)సహకారంతో రూ.80వేలు ఖర్చుతో నిర్మించబడిన 'దాశరథి అగ్నిధార కళావేదిక'ను ఎంఈఓ రవికుమార్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలోహెచ్ఎం రెహమాన్, పూర్వ విద్యార్థులు జక్కి నాగేశ్వర్, వెంకన్న, రామన్న, మల్లయ్య, మీర్జా మున్వర్‌బేగ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విఘ్నేశ్వర కల్యాణ వేడుకలు

డోర్నకల్: స్థానిక శాంతినగర్‌లోని విఘ్నేశ్వరాయలంలో గురువారం శ్రీవిఘ్నేశ్వరస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. డోర్నకల్ సీఐ బి.రాజేష్, వర్తక సంఘం అధ్యక్షుడు కాలా మహేందర్‌జైన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాగుల పరిశీలన

డోర్నకల్: భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని ఆకేరు, మున్నేరు వాగులను గురువారం తహసీల్దార్ ఇమ్మానియల్ పరిశీలించారు.

పోరాటాలు నిర్వహించాలి

నెహ్రూసెంటర్: మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని, మహిళల రక్షణ కోసం చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో చట్టాల అమలు తీరుపై సదస్సు నిర్వహించారు.

ఆత్మీయ భరోసా అమలు చేయాలి

బయ్యారం: కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకంను అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమ్మగాని సత్యం ప్రభుత్వంను డిమాండ్ చేశాడు. అనంతరం పంచాయతీ ఉద్యోగికి గురువారం వినతిపత్రంను అందజేశారు.

గ్రామసభ నిర్వహించాలి

కురవి: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీలో గత ఆరునెలల నుంచి గ్రామసభలు నిర్వహించలేదని, వెంటనే గ్రామసభ నిర్వహించాలని తహసీల్దార్ విజయ, కార్యదర్శి విజయలక్ష్మీలకు మాజీ ఉప సర్పంచ్ సంగెం భరత్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

డోర్నకల్: ఎయిడ్స్ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన ఆస్పత్రి సంపూర్ణ కేంద్రం కౌన్సిలర్ రమేష్ కోరారు. స్థానిక మైనారిటీ జూనియర్ ఒకేషనల్ గర్ల్స్ కాలేజీలో గురువారం ఎయిడ్స్, హెచ్ఐవీ వ్యాధులపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. అనంతరం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దాసరి స్వప్న, ఎస్ఎస్‌కె మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

తొర్రూరు: మెడికల్ షాపుల్లో మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా ఇన్‌చార్జ్ వింజమూరి సుధాకర్ అన్నారు. మెడికల్ షాపుల దందాపై చిన్న గూడూరు మండలం ఉగ్గంపల్లి వాసి డీఎస్ వెంకన్న గురువారం డివిజన్ కేంద్రంలో డీసీఐసీ ఇన్‌చార్జ్ సుధాకర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మహబూబాబాద్‌లోని సిద్ధార్థ ఆసుపత్రిలోని మెడికల్ షాపులో అధిక ధరలకు ఔషదాలు, మందులు ఇచ్చి తనను మోసగించారని, వారి నుంచి నష్ట పరిహారం అందించాలని బాధితుడు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

డోర్నకల్: మండలంలోని సీతారాంపురం బంజర సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గార్ల మండలం బొర్రసక్రుతండాకు చెందిన గుగులోత్ గణేష్ ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా సీతారాంపురం బంజర గ్రామ సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించారు.

అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: ఎడతెరిపి లేకుండా భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణవేణి సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని రాంపురం గ్రామంలోని పలు చెరువులు, కుంటల మత్తడి, కరకట్టలను ఆమె పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు రావద్దని పలు సూచనలు చేశారు. మత్స్యకారులు వర్షంలో చేపలు పట్టడం మంచిది కాదన్నారు. ఆర్ఐ శరత్‌చంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ రూరల్: గ్రామ పంచాయితీ సిబ్బందికి ఉద్యోగ భద్రతతో పాటుహక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ పిలుపునిచ్చారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండలలోని పలు గ్రామాల్లో కరపత్రాల ద్వారా గురువారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు సుధాకర్, విజయ్, సూరమ్మ, కుమార్ పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ

నెల్లికుదురు: గత మూడు రోజులగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని బాధితుడు హెచ్ వెంకన్న ఇంటిగోడ కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

హైవేపై గుంతలు పూడ్చిన డ్రైవర్లు



మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎమ్మెల్యే క్యాంపు సమీపంలోని ఖమ్మం -వరంగల్ 563 నేషనల్ హైవేపై పడిన గుంతలను మరిపెడ కారు డ్రైవర్లు గురువారం పూడ్చారు. ఇటీవల హైవేపై ఫీట్ లోతు గుంతలు ఏర్పడి వాహనదారులకు ప్రాణసంకటంగా మారాయి. స్పందించిన కారు డ్రైవర్లు మట్టి, కంకర పోసి గుంతలను పూడ్చారు. డ్రైవర్లను పలువురు అభినందించారు.

విద్యాజ్యోతి పథకానికి విద్యార్థినుల ఎంపిక

కేసముద్రం: కెనరా బ్యాంకు అందించే విద్యాజ్యోతి పథకం స్కాలర్‌షిప్‌నకు మండలంలోని కల్వల గ్రామ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన ఎస్టీ విద్యార్థినులు ధారావత్ నవ్య, నిహారిక, మేఘన, ఝాన్సీ, కావ్య, అనూష ఎంపికైనట్లు అమనగల్ కెనరా బ్యాంక్ మేనేజర్ అజ్మీరా జగన్ వెల్లడించినట్లు పాఠశాల హెచ్ఎం బండారు నరేందర్ గురువారం తెలిపారు.

మేకల మృతి

బయ్యారం: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన శ్రీరామ్‌కు చెందిన మేకలు బుధవారం రాత్రి పశువుల కొట్టం కూలిపోవడంతో అందులో రెండు మేకలు మృతి చెందాయి. రూ.20వేల విలువైన మేకలు మృతి చెందగా, కొన్నింటికి గాయాలయ్యాయి.

రోడ్డుపై కూలిన చెట్టు

కురవి: సీరోలు మండలం బీల్యా తండా–తాళ్లసంకీస గ్రామాల మధ్య ఖమ్మం జాతీయ రహదారిపై పెద్ద చెట్టు గురువారం సాయంత్రం రోడ్డుపై కూలింది. దీంతో చాలా సమయం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో బీల్యాతండా గ్రామ వాసులు కూలిన చెట్టును తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ




మహబూబాబాద్ అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, యువకులు

మహబూబాబాద్ అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్ర ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్, రూరల్ మండల అధ్యక్షుడు జయేందర్ నాయక్, రామచంద్రరావు, శ్యామ్‌సుందర్‌శర్మ, గద్దం అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి రవినాయక్, కార్యదర్శి స్వామి, పట్టణ ఉపాధ్యక్షుడు పెద్ద బోయిన రవియాదవ్, పద్మ పాల్గొన్నారు.

డోర్నకల్: డోర్నకల్‌లోని పలు వీధుల్లో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దేవానాయక్, గుగులోత్ దేవిక పాల్గొన్నారు.

పెద్దవంగర: ప్రధాని మోదీ దేశ భద్రత, అభివృద్ధి కోసం చేస్తున్న కృషి ప్రతి ఒక్కరికి ఆదర్శమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్కోజు భాస్కరా చారి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీమాన్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఝాన్సీ, పల్లెకుమార్, సుధాకర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సందీప్ కుమార్, రాము పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



కేసముద్రం: ఇనుగుర్తి మండలంలో తీజ్ వేడుకలు..

కేసముద్రం/మహబూబాబాద్ రూరల్/కురవి: కేసముద్రం మండలంలోని మలు తండాచీన్యాతండాజీపీ శివారు ఐలయ్య బావితండాలో గురువారం తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారు చంద్రు తండాలో , కురవి మండల కేంద్రం శివారు తులిస్యా తండా జీపీ పరిధిలోని లచ్చిరాం తండాలో తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వాగులో పడిన ద్విచక్రవాహనదారులు

- ఒకరు మిషన్ భగీరథ పైపుతో.. మరొకరు చెట్టు సాయంతో క్షేమంగా బయటకు..
- నాజీతండాశివారులో ఘటన

ఖానాపురం: మండలంలోని నాజీతండాశివారులో వాగులో ద్విచక్రవాహనదారులు పడిపోయిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుంజేడు గ్రామానికి చెందిన నీలం సూరయ్య, వేలుబెల్లి గ్రామానికి చెందిన బొజ్జ వినయ్‌కుమార్ పనుల నిమిత్తం నర్సంపేటకు వచ్చారు. పనులు ముగించుకుని నాజీతండా మీదుగా వెళ్తూ ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటే ప్రయత్నం చేశారు. దీంతో వేర్వేరుగా ఇద్దరు వాగులో ద్విచక్రవాహనాలతో సహా పడిపోయారు. వినయ్‌కుమార్ వాగులో ఉన్న మిషన్ భగీరథ పైపుద్వారా బయటకు రాగా, సూరయ్య కొద్ది దూరం కొట్టుకుపోయి చెట్టు సాయంతో బయటకు వచ్చారు. ఇరువురి ద్విచక్ర వాహనాలతోపాటు సెల్‌ఫోన్లు వాగులో కొట్టుకుపోయాయి. అప్రమత్తమైన ఎస్సై రఘుపతి సంఘటనా స్థలం వద్దకు వెళ్లి వాహనదారులు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. అప్పటికే అక్కడ పెట్టిన బారికేడ్‌లతో రహదారిని పూర్తిగా మూసివేయించారు. వాహనదారులు భూపతిపేట మీదుగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.

విమర్శలు అర్థరహితం

తొర్రూరు: ఎమ్మెల్యే సహకారంతో పాలకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఝాన్సీరెడ్డిపై పలువురి అసమ్మతి నేతల విమర్శలు అర్థరహితమని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు పెదగాని సోమయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం సోమయ్య మాట్లాడుతూ.. కన్నతల్లి లాంటి పార్టీపై, ఝాన్సీరెడ్డికి వ్యతిరేకంగా ఎవరు పని చేసినా వారికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, జాటోతు రవి, అలువాల సోమయ్య, బిజ్జాల అనిల్, గోపి, సురేందర్ పాల్గొన్నారు.